అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి 4




సంపుటి - 3 సంచిక -36 ఆదివారం 5 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి

## మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి



**మిడ్జిల్‌లో నాటిన మొక్క..మహావృక్షమైంది**

**పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం**

**పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు**

**పాలమూరు బిడ్డలు పార పట్టగలరు..పాలన చేయగలరు**

**మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది**

**మిడ్జిల్ మండల అభివృద్ధి బాధ్యత ఇక భట్టిదే**

**మహబూబ్‌నగర్,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా **మిగతా 2లో...**

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

**యుద్ధం వేళ ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి**

**అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం**

**రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ**



**జయపుర,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం,**మిగతా 2లో...**



# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

**వీరిలో 17 మంది పాక్ పౌరులు, ఆరుగురు భారతీయులు**

**జాబితాలో జైష్, లష్కరే తోయిబా కీలక నేతలు**

**ఉగ్రదాడులు, చొరబాట్లు, నిధుల సమీకరణ, నియామకాల ఆరోపణలు**

**సుంజ్వాన్, నాగ్రోటా దాడులతో సంబంధాలున్నట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్-ఎ-మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు.**మిగతా 2లో...**

# ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

**డ్రగ్ కంట్రోలర్ , ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలసి పనిచేయాలి**

**అధికారులకు సిఎస్ సంజయ్ జాజూ ఆదేశం**



**హైదరాబాద్,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను **మిగతా 2లో...**

# అప్పులపై భట్టివన్నీ అబద్ధాలే

**ఆరు గ్యారంటీల అమలు**

**తప్పించుకోవడానికే గోబెల్స్ ప్రచారం**

**బీఆర్ఎస్ పదేండ్లలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లే**

**రెండున్నరేండ్లలో కాంగ్రెస్ అప్పు రూ.4.50 లక్షల కోట్లు**

**ఎక్కడైనా చర్చకు సిద్ధం.. దమ్ముంటే అసెంబ్లీ పెట్టాలి**

**: మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్**



**హైదరాబాద్ జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసిన అప్పులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అబద్ధాలు, అర్థసత్యాలు చెప్పి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పులపై అంకెల గారడీ తప్ప వాస్తవాలను చెప్పలేదని తెలిపారు. భట్టికి వాస్తవాలు తెలియదని అనుకోవడం లేదన్నారు. వాస్తవాలు తెలిసి కూడా రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి తప్పించుకోవడం కోసమే ఆయన గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.8,21,651 కోట్లు అని భట్టి **మిగతా 2లో...**

# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

**వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..**

**ఇక ఆఫీసుల చుట్టూ తిరగనక్కర్లేదు!**

**రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు**

**మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు చెక్**

**రూ.10 లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100**

**వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్ఎంసీ తప్పనిసరి**

**అమరావతి జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు అనుమతించిన సర్కార్, తాజాగా మరో కీలక ముందడుగు వేసింది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు**మిగతా 2లో...**



# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు **మిగతా 2లో...**

# పోలీస్ కొలువుల జాతర..

## 7 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం

**హైదరాబాద్,,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పోలీస్ కొలువు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరదించుతూ, హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో భారీగా ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. పోలీస్, జైళ్లు, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) విభాగాలలో ఖాళీగా ఉన్న దాదాపు 7,000 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.**మిగతా 2లో...**



# కవితకు ఎన్నికల సంఘం షాక్

## టిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్

**అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత**

**అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి**

**హైదరాబాద్,,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. **2లో...**



# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది. ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. 2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

**మొదటిపేజీ తరువాయి**

15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కొలువుల జాతర..

**మొదటిపేజీ తరువాయి**

ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసే దిశగా, ప్రభుత్వం ఇప్పటికే 5,000 పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోలను జారీ చేసింది. మిగిలిన 2,000 పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు కూడా మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక శాఖ నుంచి అవసరమైన అనుమతులు కూడా లభించడంతో, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) సమగ్ర నోటిఫికేషన్ జారీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఒకటి రెండు రోజుల్లోనే అభ్యర్థుల అర్హతలు, సిలబస్, పరీక్షల నిర్వహణ తేదీలతో కూడిన పూర్తి వివరాలను బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో కొత్త పోలీస్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని, వయోపరిమితి సడలించాలని నిరుద్యోగ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు, విజ్ఞప్తులు చేస్తున్న విషయం తెలిసిందే. వారి డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఈ నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా, పారదర్శకంగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేసేందుకు పోలీస్ బోర్డు అధికారులు విధివిధానాలను ఖరారు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత హోంశాఖలో భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. స్వరాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 2015 చివరి రోజున 9,281 పోస్టుల భర్తీకి తొలి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత, 2018లో రికార్డు స్థాయిలో 1,217 ఎస్సై, 16,285 కానిస్టేబుల్ పోస్టులతో రెండో విడత భర్తీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం మూడో విడతగా 2022లో 554 ఎస్సై పోస్టులు, 15,644 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టారు. ఇప్పుడు నాలుగో విడతలో భాగంగా మరో 7,000 ఉద్యోగాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో, పోలీస్ శాఖలో స్థిరపడాలని కలలు కంటున్న వేలాది మంది నిరుద్యోగుల ఆశలు మళ్లీ చిగురించాయి. త్వరలో వెలువడనున్న అధికారిక నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

**మొదటిపేజీ తరువాయి**

రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి.. కొత్త విధానం ఇలా**

ఇంతకుముందు, కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.

తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే 'ఆటో-మ్యుటేషన్' ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి.

**వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి**

అయితే, ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.

**రైతులకు భారీ ఊరట**

గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10 లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100 స్టాంప్ డ్యూటీగా, రూ. 10 లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతో పాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడం కూడా సులభతరం అవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.

# ఇంధన సంక్షోభాన్నిఅధిగమించాం

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40-50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25-26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హోర్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

---------------------------

# అప్పులపై భట్టివన్నీ అబద్ధాలే

**మొదటిపేజీ తరువాయి**

కట్టుకథ చెప్పారన్నారు. 2014 జూన్ 2 నాటికి ఎఫ్ఆర్‌బీఎం రుణాలు, ప్రభుత్వ గ్యారంటీ రుణాలు రూ.84,628 కోట్లు బీఆర్ఎస్ ఖాతాలో చూపారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023, డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు తెచ్చిన అప్పులు రూ.15,118 కోట్లు కూడా బీఆర్ఎస్ అప్పుల్లో కలిపారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయకపోయినా రూ.99,386 కోట్లు తమ ఖాతాలో కలిపారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి అంటే 2023, డిసెంబర్ 7నాటికి ప్రభుత్వంపై ఉన్న అప్పు రూ.5,16,881 కోట్లు అని భట్టి వివరించారనీ, అందులోనుంచి రూ.99,386 కోట్లు తీసివేస్తే పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,17,495 కోట్లు అని స్పష్టం చేశారు. కాగ్ లెక్కల ప్రకారమైతే రూ.4,10,819 కోట్ల అప్పు చేసినట్టు గణాంకాలున్నాయని వివరించారు. ఇందులో కాళేశ్వరం కార్పొరేషన్, సీతారామ కార్పొరేషన్, పాలమూరు రంగారెడ్డి కార్పొరేషన్, మిషన్ భగీరథ కూడా ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం, బడ్జెట్ గణాంకాలు, కాగ్ నివేదిక, ఎకనామిక్ సర్వే ప్రకారం చేసినా బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు దాటలేదని వివరించారు. ఇదే విషయాన్ని తాను అసెంబ్లీలో చెప్పానని గుర్తు చేశారు. దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమనీ, దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలను పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కోసమే స్కాంల నుంచి డైవర్షన్ చేయడం కోసమే అప్పుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ అప్పు రూ.3.47 లక్షల కోట్లన్న సీఎం


కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎంతోపాటు అన్ని రకాల అప్పులు కలిపి ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి రూ.3,47,294 కోట్లు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది మార్చి 18న అసెంబ్లీలో స్వయంగా ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. నాలుగు నెలల్లో అప్పు ఎట్ల తగ్గిందని ప్రశ్నించారు. గతనెల 30 నాటికి పబ్లిక్ డొమైన్‌లో ఉన్న లెక్కల ప్రకారం 31 నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ.4.50 లక్షల కోట్లని వివరించారు. ఈ అప్పులు దొంగదారిన లంచాలు ఇస్తూ తెస్తున్నారని విమర్శించారు.

రూ.వేల కోట్ల అప్పులు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా, రూ.వందల కోట్లు లంచాలు (బ్రోకర్ కమీషన్లు) ఇచ్చి తెస్తున్నారని అన్నారు. రూ.70 వేల కోట్ల అప్పు కోసం రేవంత్ రెడ్డి బ్రోకర్లకు ఇచ్చే లంచం రూ.1,200 కోట్లని చెప్పారు. 40 లక్షల టన్నుల బొగ్గు మాయంపై సింగరేణి విజిలెన్స్ డైరెక్టర్‌ను విచారణ చేపట్టాలని భట్టి ఆదేశించడం దొంగకే విచారణ చేసుకోమ్మని చెప్పినట్లుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా



డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా? ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్షరం ప్రజల పక్షం
జర్నలిస్ట్ వార్త
RNI NO: TELTEL/2023/87607
తెలుగు దిన పత్రిక
ఆదివారం 5 జులై 2026

# గ్రామాభివృద్ధికి కమిటీలతో సమిష్టి కార్యాచరణ

## ధర్మసాగర్‌లో ప్రత్యేక సమావేశం



**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జులై 4 (జర్నలిస్ట్ వార్త)**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ అభివృద్ధి కమిటీల ఏర్పాటు అంశంపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాచర్ల ఏలియా జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాభివృద్ధికి కమిటీల పాత్రపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో కార్యాచరణ చేపడతామని తెలిపారు. వార్డు సభ్యులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఉప సర్పంచ్ కొంతం కొమురమ్మ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి




**ఖమ్మం/జూలై 4 (జర్నలిస్ట్ వార్త);** జిల్లాలో చేపట్టిన రహదారులు, వంతెనలు, భవనాల నిర్మాణ పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారులు, భవనాల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి పనుల్లో ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఖమ్మం కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో జరుగుతున్న రహదారి పనులు, ముదిగొండవల్లభి ఫోర్‌లేన్ నిర్మాణాన్ని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాలని ఆదేశించారు. బోనకల్‌ఆలపాడు రహదారి నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు అవకాశం ఉన్నందున సంబంధిత అభివృద్ధి పనులు, ఏర్పాట్లను శాఖల సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, ఈఈలు బషీర్, సీతారామయ్య, డీఈ భగవాన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మొట్ల తిమ్మాపురం గ్రామంలో భూ రీసర్వేపై అవగాహన సదస్సు

## -తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,జులై 4.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం మెట్లతిమ్మపురం రెవిన్యూ పరిధిలో రైతులతో మెట్ల తిమ్మాపురం గ్రామపంచాయతీలో ప్రత్యేక భూ రీసర్వే పై సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ నాగరాజు పాల్గొని మాట్లాడుతూ భూ రీ సర్వే నిర్వహించేటప్పుడు ఆ గ్రామ పరిధిలో ఉన్న రైతులందరూ కూడా తమ తమ ప్రదేశాల వద్ద అందుబాటులో ఉన్నట్లయితే సర్వే చేయుటకు అనుకూలంగా ఉంటుందని,ఎ రైతుకు ఎంత భూమి ఉందో తెలుస్తుందన్నారు. భూమి రీ సర్వే చేయడం వలన ప్రతి కమతానికి ఒక నెంబర్,సర్వే మ్యాప్ కేటాయిస్తారన్నారు. దీని వలన ప్రతి రెవిన్యూ గ్రామం యొక్క సరిహద్దులు కూడా నిర్ణయం చేయటం జరుగుతుందనీ గ్రామ సభ ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్,పంచాయతీ సెక్రెటరీ,జిపిఓ,ఐకేపీ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్,మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఇతర సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

## రాహుల్‌ను ప్రధాని.. రేవంత్‌ను మరోసారి సీఎం చేయడమే ధ్యేయం

## ధర్మసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసరు రమేష్

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 4( జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తాటికాయల గ్రామానికి చెందిన పెసరు రమేష్‌కు శనివారం సుస్మిత ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్ర ప్రసాద్‌ను నాయకులు శాలువాతో సన్మానించి సేవలను కొనియాడారు.

కార్యకర్తలే పార్టీకి బలం ఈ సందర్భంగా పెసర రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమమే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి
రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

## మద్యం మత్తులో దారుణం.. పరారీలో నిందితుడు



**కల్లూరు,/ జూలై 4( జర్నలిస్ట్ వార్త)** మద్యం మత్తులో ఓ తండ్రి తన కన్న కొడుకును హత్య చేసిన ఘటన ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేద్కర్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి సీతారాములు ఆటో డ్రైవర్. శుక్రవారం రాత్రి తన కుమారుడు కిరణ్‌కుమార్ (30)ను సమీపంలోని బెల్ట్‌షాపుకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. అనంతరం ఇంటికి వచ్చిన తర్వాత ఇద్దరి మధ్య జరిగిన గొడవలో సీతారాములు కుమారుడిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తల వెనుక భాగంలో బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావానికి గురైన కిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. కుమారుడు చనిపోయినట్లు గుర్తించిన సీతారాములు తన ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్లూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. నిందితుడి కోసం మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు

# రాంనగర్‌లో బెల్ట్ షాపులు బంద్ చేయాలి

## సర్పంచ్‌కు వినతిపత్రం అందజేసిన యువకులు, గ్రామస్తులు



**భీమదేవరపల్లి/జులై4 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్, మంగళపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే బంద్ చేయాలని గ్రామంలోని యువకులు, గ్రామస్తులు శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దప్పు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బెల్ట్ షాపుల కారణంగా గ్రామ ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, యువత మద్యానికి బానిసై వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో బెల్ట్ షాపులు పూర్తిగా నిలిపివేసేందుకు గ్రామపంచాయతీలో ప్రత్యేక తీర్మానం చేసి, అక్రమంగా మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన సర్పంచ్ దప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, బెల్ట్ షాపుల అంశంపై గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గ్రామపంచాయతీ స్థాయిలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# కష్టంలో ఉన్న స్నేహితురాలికి తోటి క్లాస్‌మేట్స్ అండ



**రాయపర్తి /జులై4,(జర్నలిస్ట్ వార్త);** మండలం గన్నారం గ్రామానికి చెందిన రాపాక రోజా తండ్రి ఉప్పల్ రెడ్డి ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న రోజా బాల్య స్నేహితులు (కొండూరు ప్రభుత్వ పాఠశాల 2008–09 పదవ తరగతి బ్యాచ్) మానవత్వంతో వెంటనే స్పందించారు. తమతో పాటు చదువుకున్న స్నేహితురాలి కుటుంబానికి భరోసా కల్పించేందుకు తోటి విద్యార్థులంతా ఒకతాటిపైకి వచ్చారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మిత్రులు, తమ వంతు సహాయంగా సేకరించిన ₹25,000 నగదును రోజా కుటుంబ సభ్యులకు అందజేశారు. 2016 నుండి తామంతా ఒకే కుటుంబంగా ఉంటూ, ఆపదలో ఉన్న తోటి మిత్రులకు ఆర్థిక, ఉద్యోగ భరోసా కల్పిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. తమ చిన్న సహాయం ఆ కుటుంబానికి ధైర్యాన్ని ఇస్తుందని ఆశిస్తున్నట్లు స్నేహితులు పేర్కొన్నారు. బాల్య స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ ఆపద సమయంలో అండగా నిలిచిన 2008–09 టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థుల ఐక్యత, మానవత్వాన్ని చూసి గన్నారం గ్రామ ప్రజలు, పలువురు మేధావులు వారిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# ఇంటర్ ధర్మసాగర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో 45 సీట్లు ఖాళీ




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోజూలై 4: (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ సి ఈ సి గ్రూపులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా మహిళ విద్యాలయం స్పెషల్ అధికారి మా దేవి, శనివారం తెలిపారు. సాధారణ విభాగంలో 40 సీట్లు, మిగిలిన కోటాలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 8ను చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 88979 53178 నంబర్‌ను సంప్రదించాలని ప్రత్యేక అధికారి కోరారు.

# తాటిపూడిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన



**వైరా/, జూలై 4 (జర్నలిస్ట్ )వార్త**
వైరా మండలంలోని తాటిపూడి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం గ్రామ సర్పంచ్ జవాజీ అశ్విని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆమె పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. అవసరమైతే దీనికి మరింత ఆకర్షణీయమైన ఈనాడు శీర్షిక కూడా రూపొందిస్తాను.

# సత్తుపల్లి బీఎల్‌ఏ ఇన్‌చార్జిగా రాయల రాము



**తల్లాడ/, జూలై 4( జర్నలిస్ట్ వార్త)**
ప్రత్యేక ఓటరు జాబితా (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం నేపథ్యంలో ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏ ఇన్‌చార్జిలను నియమించింది. ఇందులో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గ బీఎల్‌ఏ ఇన్‌చార్జిగా కాంగ్రెస్ నాయకుడు రాయల రామును నియమించారు.
ఈ సందర్భంగా రాయల రాము మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# కంబాలపల్లి సొసైటీ సబ్ సెంటర్ లో యూరియా రోజుకో రేటు..!

## యూరియా అమ్మకాలపై సేకరిస్తున్న మీడియాపై సొసైటీ ఇంచార్జ్ ఆక్రోశం.

**బయ్యారం/,జులై 4.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని కంబాలపల్లి సొసైటీ సబ్ సెంటర్ లో యూరియా అమ్మకాలపై జరుగుతున్న తీరును రైతుల నుండి వివరాలు సేకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కంబాలపల్లి సబ్ సెంటర్ నిర్వాహకుడు మేము ఒక్కరమే ఎక్కువ రేట్లకు యూరియా అమ్ముతున్నామా మాపై కావాలని కథనాలు రాస్తున్నారని అసభ్య పదజాలంతో దూషించాడు. ఈ నెల 2 వ తారీకు కంబాలపల్లి సబ్ సెంటర్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో యూరియా బస్తాకు 285 రూపాయలకు విక్రయాలు అనే శీర్షిక న్యూస్ పేపర్ లో ప్రచురితం అయ్యింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కంబాలపల్లి సబ్ సెంటర్ కు యూరియా దిగుమతి అయ్యింది. శనివారం సోసైటీ సబ్ సెంటర్ లో యూరియా బస్తాలను రైతులకు బస్తా 283 రూపాయలకు రైతులకు అందించినట్లు రైతులు తెలిపారు. కంబాలపల్లి సబ్ సెంటర్లలో గత డిసెంబర్ 29 నుండి ఈ సంవత్సరం జులై 2 వరకు 10,500 యూరియా బస్తాలు దిగుమతి అయి రైతులకు విక్రయించినట్లు సొసైటీ అధికారుల నుండీ అందిన సమాచారం. అ దిగుమతి అయిన యూరియా బస్తాలకు సబ్ సెంటర్ నిర్వాహకుడు యూరియా బస్తాకు 267 రూపాయల చొప్పున 28 లక్షల 3 వేల ఐదు వందల రూపాయలు సొసైటీ ఆఫీస్ నందు పలు విడతలో జమ చేసినట్లు సమాచారం. సోసైటీ నిర్వాహకులు బస్తాకు 266.50 పైసలు చొప్పున రైతులకు యూరియా అందించవలసి ఉన్న,దీనికి భిన్నంగా కంబాలపల్లి సబ్ సెంటర్ లో భిన్నంగా యూరియా బస్తాకు 285 రూపాయలు వసూల్ చేసి బిల్లులో మాత్రం 266 రూపాయలు రాసి రైతుల దగ్గర నుండీ 285 రూపాయలు నగదు తీసుకొని రైతులను మోసం చేస్తున్నట్లు గిరిజన రైతులు తెలిపారు. సొసైటీ నిర్ణయించిన రేటుకు నిర్వాహకుడు అమ్మిన రేట్లకు వ్యత్యాసం 19 రూపాయలు ఉన్నట్లు,వాటిలో హమాలీకి బస్తాకు 10 రూపాయలు పోను,9 రూపాయలు చొప్పున 10,500 యూరియా బస్తాలకు సుమారుగా 94,500 రూపాయలు సబ్ సెంటర్ ఇంచార్జ్ తన జేబులో వేసుకున్నట్లు సమాచారం.




### నాయిని సాంబశివరావు.రైతు



యూరియా యాప్ ద్వారా శుక్రవారం యూరియా బుక్ చేసుకున్నాను. కంబాలపల్లి సబ్ సెంటర్ లో ఐదు బస్తాల యూరియాకు 1415 రూపాయలు చెల్లించాను. బస్తాకు 283 రూపాయలు చెల్లించాను. ఒక బస్తాకు హమాలి ఖర్చు కింద 13 రూపాయలు తీసుకున్నారు. గతంలో కంటే రెండు రూపాయలు ఈ రోజు తగ్గించారు. జూన్ నెలలో ఒక బస్తా యూరియాకు 285 రూపాయలు తీసుకున్నారు.

### ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

**-జిల్లా సహకార అధికారి విజయలక్ష్మి.**

దీనిపై జిల్లా సహకార సంఘ అధికారి విజయలక్ష్మిని వివరణ కోరగా ప్రభుత్వం నుండి యూరియా బస్తా 266.5 రూపాయలు అమాలీ ఖర్చుతో కలిపి సబ్ సెంటర్లకు దిగుమతి అవుతుందని,సోసైటీ సిబ్బంది రైతులకు 266.5 రూపాయలకు మాత్రమే యూరియా విక్రయించాలని, అంతకుమించి సబ్ సెంటర్ నిర్వాహకులు రైతులకు యూరియా ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై దుష్ప్రచారం తగదు



**వర్ధన్నపేట/జూలై 4(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై దొరల సామాజిక వర్గం లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచారం చేయడం సరైనది కాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య హితవు పలికారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిటైర్డ్ సీపీ, విద్యావంతుడైన నాగరాజుకు సీఎం రేవంత్ రెడ్డి బీ-ఫామ్ ఇవ్వడంతో బడుగు, బలహీన వర్గాలు అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నాయని గుర్తుచేశారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజల మధ్య ఉంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ఎమ్మెల్యే కృషి చేస్తుంటే, ఓర్వలేక దొరల రాజ్యం కోసం కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మండల కమిటీలు, పార్టీ పదవులు డీసీసీ, పీసీసీల ద్వారా జరుగుతాయని, దీనికి ఎమ్మెల్యేకు సంబంధం లేదని స్పష్టం చేశారు. పార్టీలో ఏవైనా సమస్యలుంటే అధిష్టానానికి ఫిర్యాదు చేయాలే తప్ప, బహిరంగంగా ప్రెస్ మీట్లు పెట్టడం వెనుక ప్రతిపక్షాల మెప్పు కోసమేనని ధ్వజమెత్తారు. నిబంధనలు ఉల్లంఘించి ఎమ్మెల్యేపై విమర్శలు చేసిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరేందుకు త్వరలోనే పీసీసీ అధ్యక్షుడిని కలుస్తానని వెంకటయ్య హెచ్చరించారు.

## ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరూ భాగస్వామ్యం కావాలి



**సికింద్రాబాద్/ జూలై 4(జర్నలిస్ట్ వార్త):** ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావాలంటే పక్కాగా ఉన్న ఓటరు జాబితా ఎంతో కీలకమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. శనివారం స్థానిక శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్‌లోని బరోడ లేన్, కింటి కాలనీ తదితర ప్రాంతాలలో ఆమె పర్యటించారు. బీఎల్ఓ అఖిలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మితా కోటేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ప్రతి ఓటరు చైతన్యవంతంగా ఈ ప్రక్రియలో పాల్గొని, వివరాలను సవరించుకోవడం ద్వారా ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. తద్వారానే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్ఠంగా మారుతుందని ఆమె పిలుపునిచ్చారు.

# క్రమశిక్షణ కలిగిన యువతే దేశానికి ఆదర్శం





**వర్ధన్నపేట/జూలై 4(జర్నలిస్ట్ వార్త):** క్రమశిక్షణ కలిగిన యువత దేశానికి ఆదర్శంగా నిలవాలని 4(టీ) ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, వింగ్ కమాండర్ వినోద్ కుమార్ ఆర్య పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్సీసీ ఎయిర్ వింగ్ విద్యార్థులకు ఏ సర్టిఫికేట్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ ఆర్య మాట్లాడుతూ

ఎన్సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని పెంపొందిస్తుందని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి విద్యా, ఉపాధి రంగాల్లో విశేష ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలలో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యతో పాటు ఎన్సీసీ శిక్షణ ఇవ్వడం విద్యార్థులకు ఒక గొప్ప అవకాశమన్నారు. నేటి క్రమశిక్షణ గల క్యాడెట్లే రేపటి భావి భారత నిర్మాతలని అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ నిమ్మ మనుజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సార్జెంట్ జడేజాతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రమణా రావు, అశోక్, కుమార స్వామి, మదన్ మోహన్, దేవయ్య, లలిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం



**సికింద్రాబాద్/జూలై 4(జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రధాన ధ్యేయమని బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ స్పష్టం చేశారు. శనివారం ఆమె డివిజన్ పరిధిలోని గొల్లపుల్లయ్య బావి తదితర ప్రాంతాలలో పర్యటించి, స్థానిక బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నాలా సమస్యతో పాటు మంచినీటి కొరతను స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శైలజ శ్రీకాంత్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి నాలా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తక్షణమే నూతన బోర్ వెల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇదే సందర్భంలో ఎస్ఐఆర్ ఇన్చార్జ్ మల్లికార్జున్ ఆమెకు ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, పాకసాయి, బ్రహ్మాచారి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

**క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత**

**రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు**

**ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో సమన్వయంతో పనిచేయాలి**

**అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం**



**హైదరాబాద్,జూలై 4(జర్నలిస్ట్ వార్త)::** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం

విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయన్నారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం' అని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

**అపరిశుభ్ర వాతావరణం..కల్తీ పదార్థాలు**

**దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు**

**వందరోజుల్లో 185 కేసులు నమోదు**



**హైదరాబాద్,జూలై 4(జర్నలిస్ట్ వార్త):** ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్ఎస్-ఎస్ఏఐ లైసెన్స్, ఈఎఈక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100, ఊ-ఈం÷ వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుంటా

## 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రేవత్ భావోద్వేగ పోస్ట్

**హైదరాబాద్,జూలై 4(జర్నలిస్ట్ వార్త);**
ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తన రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం గురించి ఎక్స్‌లో భావోద్వేగ పోస్ట్ చేశారు. ఈ 20వసంతాల ప్రయాణం ఎన్నో విజయాలు, మరెన్నో సవాళ్లు... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం...అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతోనే తన అనుబంధాన్ని కొనసాగించినట్లు తెలిపారు. మిడ్జిల్‌లో సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణం, ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రజల గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే స్థాయికి చేరడం వెనుక ప్రజల విశ్వాసమే కారణమని సీఎం పేర్కొన్నారు. లక్షల అక్షరాలతో రాసినా... కోట్ల పదాలతో చెప్పినా... ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్న రేవంత్ రెడ్డి... ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి సంఘర్షణలో తనతో కలిసి నడిచిన ప్రజలు, కార్యకర్తలు, ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా...'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.

-----------